


# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

APRIL - 2009

సంవత్సర చందా రూ. 50/-

# ప్రకటన గ్రంథ వ్యాఖ్యానము

సత్యవాక్కులో గత 34 మాసములుగా (2006 ఆగస్టు నుండి 2009 మే నెలవరకు) ప్రకటన గ్రంథ ప్రసంగమాలికను ప్రచురించుచు వచ్చాము. ప్రకటన గ్రంథములోని 22 అధ్యాయాలు అందు చక్కగా వివరించబడి యున్నవి.

జాషువా గూటం గారు ఈ గ్రంథముపై క్రీస్తు సంఘములో అమెరికాలో యున్న అనేక బైబిలు పండితులు వ్రాసిన వ్యాఖ్యానములు చదివి, వాటిని క్రోడీకరించి ఆంధ్రలో యున్న బోధకులు తమ స్థానిక సంఘములకు ఉపదేశించుటకు వీలుగా యుండునట్లు ఈ ప్రసంగ మాలికలను తయారుచేసి ప్రచురిస్తు వచ్చారు. ఇప్పుడవన్నీ ఒక పుస్తక రూపమున ముద్రించాలని అనేకులు ఉత్తరాలు ద్వారా , ఫోన్ల ద్వారా తెలియజేయుచున్నారు గాన వారి కోరిక మేరకు విశ్వాసముతో ఆపనిలో నిమగ్నులమైయున్నాము. అది గ్రంథ రూపములో ఇంకొక రెండు మాసములలో లభించగలదు. ఒక్కొక్క కాపీ కనీసం 60-రూ॥లు కావచ్చును. గనుక దానికొరకు వేచి యుండండి, దానిమూల్యమును సేకరించుకొనండి. ప్రకటన గ్రంథ ప్రసంగ మాలిక సిద్ధమవగానే మీకు తెలియజే[illegible]దుము. అప్పుడు మీరు డబ్బు పంపించి, [illegible] కాపీని పొంద[illegible]ను.

– ఎడిటర్

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 29 | ఏప్రియల్ 2009 | సంచిక -9


## యేసుప్రభువు, ఆయన సువార్త

(Jesus and the Gospel)

ప్రతి మానవుడు పాపము చేసి దేవునినుండి దూరమైపోవుచున్నాడు. అయితే తండ్రియైన దేవుని యొద్దకు అతడు తిరిగి చేరుకొనే మార్గము యేసుక్రీస్తే. మన మొదటి తల్లిదండ్రులు పాపము చేయగా, స్త్రీ సంతానమునకును సర్ప సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును, నీవు దాని మడిమెమీద కొట్టుదువని సర్పముతో దేవుడు చెప్పారు (ఆది.కా. 3:15). అంటే అపవాది యొక్క తల చితుక గొట్టబడతాదని ఆయన చెప్పెను. ఇంకో మాటలో మానవుని జీవిత సమస్యలలో అపవాది యొక్క శక్తిని ఆయన నాశనము చేయబోవుచున్నాడు. అయితే దానిని సాధించుట కొరకు ఆయన స్త్రీ సంతానమును గాయపరచబోవుచున్నారు. యేసుప్రభువు సాతాను యొక్క తలను చితుక గొట్టారు. ఏలయనగా వాగ్దానము చేయబడిన స్త్రీ సంతానమే యేసుక్రీస్తు .

ఈ సంగతిని మనం కొంత ఆలోచించుదాం. ఆదికాండము 12వ అధ్యాయములో, "భూమి యొక్క సమస్త

వంశములు నీయందు ఆశీర్వదించబడునని దేవుడు అబ్రాహాముకు " వాగ్దానము చేసెను (ఆది.కా. 12:3). యిది అబ్రాహాముకు, భూమి మీదనున్న సమస్త వంశములకు దేవుడు చేసిన గొప్ప వాగ్దానము. ఈ ఆశీర్వాదము యేమిటి ? అపొ..కా. 3:25లో పేతురు, దేవుడు చేసిన ఈ వాగ్దానమునకు మీరు వారసులై యున్నారని యెరూషలేము ప్రజలతో చెప్పి, వాగ్దానము చేయబడిన సంతానము యేసుక్రీస్తని వక్కాణించాడు. "దేవుడు తన సేవకుని పుట్టించి మీలో ప్రతివానిని వాని దుష్టత్వమునుండి మళ్ళించుటవలన మిమ్ము నాశీర్వదించుటకు ఆయనను మొదట మీ యొద్దకు పంపెనని చెప్పెను" (అపొ.కా. 3:26).

గలతీ 3:16లో "అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను; ఆయన అనేకులను గూర్చి అన్నట్టు-సంతానములకును అనిచెప్పక, ఒకని గూర్చి అన్నట్టే-నీ సంతానమునకును అనెను. ఆ సంతానము క్రీస్తు" అని వ్రాయబడినది. గనుక సర్వలోకము క్రీస్తుద్వారా ఆశీర్వదింపబడవలసి యున్నది. ఏదెను వనములో ఆదాము ద్వారా తీసికొని రాబడిన పాపపు సమస్య నుండి బయటపడు ఈ మార్గము మానవులకు గొప్ప సువర్తమానమై యున్నది.

యేసుప్రభువు మానవుని ఆత్మీయ మరణము నుండి, శారీరక మరణము నుండి విమోచించెను గనుక యిది ఆశీర్వాదము. "ఏలయనగా.... ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధానపరచబడిన యెడల, సమాధాన పరచబడిన వారమై ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము" (రోమా 5:10). "ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలోనుండి లేపబడియున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు" (1 కొరింథీ 15:20-22). ఆదాము హవ్వలకు, అబ్రాహాముకు దేవుడు వాగ్దానము చేసిన స్త్రీసంతానము క్రీస్తే. ఏలయనగా, కాలము పరి పూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను. ఆయన స్త్రీ యందు (అంటే పురుషుని మూలముగా గాక), పుట్టెను అని గలతీ 4:4 చెప్పుచున్నది. అయితే యేసుప్రభువు సాతానుని తల చితుకగొట్టి మానవజాతి కంతటికిని ఎట్లు ఆశీర్వాదమయ్యెను? దానిని తెలిసికొనుటకు కొన్ని లేఖన భాగములను ఇప్పుడు గమనించుదాం.

యోహాను 3:16:- "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను". 1యోహాను 3:8 " అపవాది మొదటి నుండి పాపము చేయుచున్నాడు, గనుక పాపము చేయుప్రతివాడు అపవాది సంబంధి. అపవాది యొక్క క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను".

హెబ్రీ 2:14-15:- "కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గలవారైనందున ఆ ప్రకారమే మరణము యొక్క బలముగలవానిని, అనగా మరణము ద్వారా నశింపజేయుటకును, జీవిత కాలమంతయు మరణభయముచేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును, ఆయన కూడ రక్తమాంసములలో పాలివా డాయెను".

మానవుని ఆత్మీయ మరణము నుండి రక్షించుటకు, లేదా ఆత్మీయ మరణమును నాశనము చేయుటకు యేసు సిలువపై మరణించెను. ఆదాము చేసిన వ్యక్తిగత పాపము వలన ఆత్మీయముగా మొదట మరణించినవాడు అతడే (రోమా 5:12). అయితే మానవుడు తిరిగి దేవునితో సత్సంబంధమును కలిగియుండు నిమిత్తము యేసు చనిపోయెను. మానవుని వ్యక్తిగత పాపముల వలన అతడు దేవుని నుండి వేరు చేయబడినాడు. యిది ఆత్మీయ మరణం. ఆత్మీయ మరణం నుండి మానవుని రక్షించడానికి :

1. యేసుప్రభువు పరలోకము నుండి భూలోకానికి వచ్చెను. ఆయన ఆదినుండియు పరలోకములో నుండెను. గాని ఆయన పరలోకమునుండి దిగి వచ్చెను (యోహాను 6:51,62). ఆయన మనుష్యరూపము దాల్చిన దేవుడె అయినను, మానవునివలె అన్ని విషయములలోను శోధించబడెను, గాని పాపము లేనివాడుగా ఉండెను (హెబ్రీ 4:15). "ఆయన దేవుని స్వరూపము కలిగిన వాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్ట కూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని, మనుష్యుల పోలికగా పుట్టిదాసుని స్వరూపము ధరించుకొని తన్నుతానే రిక్తునిగా చేసికొనెను" (ఫిలిప్పీ 2:6-7).

2. యేసు మానవుని పాపముల నిమిత్తమై మరణించెను. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు మానవులందరి పాపముల నిమిత్తము కల్వరిలో సిలువ వేయబడెను. "మనము పాపముల విషయమై చనిపోయి, నీతి విషయమై జీవించునట్లు ఆయన తానే తన

శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను. ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థతనొందిరి" (1పేతురు 2:24). ఇప్పుడు ఆయన మరణమునకు సాదృశ్యముగా బాప్తిస్మము పొంది లోబడినవారందరినీ ఆయన రక్షించును. సిలువపై మరణించినప్పుడు యేసు అపవాది యొక్క తలను చితుకగొట్టెను. అయితే ఆయనను సిలువ వేయించుటలో అది ఆయన మడిమెను కరచెను.

3. యేసు మరణించి తిరిగి లేచెను. మానవుని భౌతిక మరణ సమస్యను తీర్చుటకు గాను, ఆయన సమాధి చేయబడెను. మూడు దినములు అనంతరము ఆయన సజీవునిగ తిరిగి లేచెను. ఆయన మరణ సమాధి పునరుత్థానముల వలన మరణము యొక్క బలము గలవానిని, అనగా అపవాదిని ఓడించెను. గనుక ఆదామునందు అందరు ఏలాగు భౌతికంగా మృతి పొందుచున్నారో, క్రీస్తునందు అందరు బ్రదికింపబడుచున్నారు (1కొరింథీ 15:22). క్రీస్తుయొక్క పునరుత్థానమే మన పునరుత్థానము యొక్క వాగ్దానము. మృతుల పునరుత్థానము తరువాత మరణము ఇక ఉండదు (ప్రక 20:13-15). యిది మానవునికి మంచివార్త.

4. యేసుప్రభువు పరలోకమునకు ఆరోహణుడాయెను. ఆయనకు సమస్తాధికారము ఈయబడియున్నది (మత్త 20:18). ఆయన మనకొక గొప్ప ప్రధాన యాజకుడు (హెబ్రీ 8:1). మన నిమిత్తము తండ్రియొద్దనున్న ఉత్తరవాది (1యోహా 2:1). ఆయన మరల రాబోవుచున్నాడు. అప్పుడు భౌతిక మరణం శాశ్వతంగా నాశనమవుతాది. అందరికీ తీర్పు తీర్చబడతాది.

యేసుప్రభువు అన్ని విధములుగ సాతాను యొక్క తల చితుకగొట్టెను. పాపులను రక్షించుటకు ఆయన ఈ లోకానికి వచ్చెను. ఆయన యందున్న వారికి మరణభయము ఇక ఉండదు. నీవు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందితే ఆయనలో ప్రవేశించగలవు!!

# దశమ భాగము సమర్పించుట

## (The Business of Tithing)

"ఇతడెంత ఘనుడో చూచుడి. మూలపురుషుడైన అబ్రాహాము అతనికి కొల్లగొన్న శ్రేష్టమైన వస్తువులలో పదియవ వంతు ఇచ్చెను" (హెబ్రీ 7:4).

దశమ భాగమును గూర్చి సంఘారాధనలలో గాని బైబిలు క్లాసులలో గాని చెప్పగానే "మనం పాతనిబంధన కాలములో లేమని చెప్పుదురు. ఆమాట వినగానే కొందరి ముఖాలలో చిరునవ్వు కనబడును. అంటే మనం మోషే ధర్మశాస్త్రము క్రిందలేము గనుక మనకు తోచినంత ఇయ్యవచ్చునని వారి ఉద్దేశ్యము. నిజమే మనము మోషే ధర్మశాస్త్ర ప్రకారముగాక కృప కాలములోనే జీవించుచున్నాము.

ఇచ్చుటను గూర్చిన అంశాన్ని కొందరు తేలికగా ఎంచుట నిజంగా సిగ్గుకరము. యూదులు ధర్మశాస్త్ర ప్రకారము జీవించుచున్నప్పుడు వారు చిన్న దేశమైన ఇశ్రాయేలు దేశమునకు బాధ్యులు. మనకైతే సర్వలోకానికి సువార్త ప్రకటించే బాధ్యత యున్నది. ఈ గొప్ప పని జరగాలంటే క్రీస్తు సంఘసభ్యులు దశమ భాగము కంటే ఎక్కువ ఇయ్యాలని ప్రభువెరుగును. అందువలన ఆయన మనలను దశమ భాగమును గూర్చియున్న చట్టమునుండి వెలికి తీసి కృపాచట్టములో యుంచారు. తద్వారా లోకానికి అంతటికీ సువార్త అందియ్యబడును. క్రైస్తవులు ధారాళముగా ఇచ్చుట లేనందున ప్రపంచమంతటా సువార్త చాటబడుటలేదు. లక్షలాది ప్రజలు రక్షణ సువార్తను వినక ముందే తమ పాపములలో మరణించుచున్నారు.

అమెరికాలో గతంలో కొందరు ఇచ్చుటను గూర్చి ప్రత్యేకంగా మనం స్టడీ చేయనక్కర్లేదని తలంచి తామొక గుంపును తయారుచేసారు. నిజానికి ఇచ్చుటను గూర్చిన అంశము క్రైస్తవులు గ్రహిస్తేనేగాని సంఘము అభివృద్ధి జెందదు.

**పదియవ వంతు ఎప్పుడు ఆరంభమాయెను?**

యాకోబుతో దశమభాగము ఇచ్చుట ఆరంభమాయెనని చాలమంది బోధకులు చెబుతుయుంటారు. గాని అబ్రాహాము పదియవ వంతు చెల్లించుటను బైబిలులో చదువుతాము. అతడు యాకోబు యొక్క తాతగారు.

"ఇతడెంత ఘనుడో చూడుడి. మూలపురుషుడైన అబ్రాహాము అతనికి కొల్లగొన్న శ్రేష్టమైన వస్తువులలో పదియవ వంతు చెల్లించెను" (హెబ్రీ 7:4). గనుక పదియవ వంతు యిచ్చుట యాకోబుతోగాని మోషేతోగాని ఆరంభించ బడలేదు. అదెక్కడ ఆరంభ మాయెను? బహుశ అది ఆదాము దగ్గర ఆరంభమాయెను. అప్పుడు ఒకే ఒక్క కుటుంబముండెను. తదుపరి వారు అసంఖ్యాకులై అటు యిటు చెదరి పోయినను, తమ ఆరాధన విధానమును పాడుచేసి కొనినను, దశమ భాగము సమర్పించుట మరచిపోలేదు.

గనుక దశమ భాగము సమర్పించుట అనాదికాలమునుండే ప్రబలియుండెను. గనుక అబ్రాహాము పదియవ వంతును మెల్కీసెదెకుకు చెల్లించెను (ఆదికా. 14:20). దానినే మరొక సందర్భములో యాకోబు మ్రొక్కు కొనెను (ఆదికా 28:22).

"మీ పితరులనాటనుండి మీరు నా కట్టడలను గైకొనక వాటిని త్రోసి వేసితిరి. అయితే మీరు నాతట్టు తిరిగిన యెడల నేను మీ తట్టు తిరుగుదునని సైన్యములకు అధిపతియైన యెహోవా సెలవియ్యగా మేము దేనివిషయములో తిరుగుదుమని మీరందురు. మానవుడు దేవుని యొద్ద దొంగిలునా? అయితే మీరు నా యొద్ద దొంగిలితిరి. దేని విషయములో మేము నీ యొద్ద దొంగిలితిమని మీరందురు. పదియవ భాగమును ప్రతిష్ఠార్పణ ములను ఇయ్యక దొంగిలితిరి. ఈ జనులందరు నాయొద్ద దొంగిలుచునే యున్నారు. మీరు శాపగ్రస్తులై యున్నారు. నా మందిరములో ఆహారముండునట్లు పదియవ భాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసికొనిరండి. దీని చేసి మీరు నన్ను శోధించిన యెడల నేను ఆకాశపు వాకిండ్లను విప్పి పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించెదనని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చు చున్నాడు" (మలాకీ 3:7-10).

హెబ్రీయులు మాత్రమేగాక పూర్వకాలము యితరులు కూడ తమ ధనధాన్యములలోను పశువులలోను, కొల్లసొమ్ములోను కూడ పదియవవంతు సమర్పించుకొనే వారు. ఫిలిష్తీయులు, గ్రీకులు మొదలగువారు తమ యిష్ట దేవతలకు, దేవుండ్లకు దశమ భాగము యిచ్చేవారు. ఆజ్ఞ పూర్వకముగా గాక యిష్ట పూర్వకముగా సమర్పించేవారు.

ప్రతివాడు తన యిష్ట పూర్వకముగా ఇచ్చేలాగుంటే, యిన్ని జనాంగముల వారు పదియవ వంతే ఎందుకు చెల్లించేవారు? దీనిని బట్టి

ఒకానొకప్పుడు ఈ పూర్వీకులందరు సహజీవనం చేస్తు యుండేవారని, అక్కడ నుండే దశమ భాగ సమర్పణ పలుప్రాంతాలకు, జనాంగములకు ప్రాకినదని గ్రహించుకొనవచ్చును గదా? మనం పూర్వీకుల చరిత్రను చదివితే, ఐగుప్తీయులు, బబులోనీయులు, గ్రీకులు, రోమీయులు, మిగతా అన్య జనాంగములు దేవునికి దశమ భాగమర్పించే వారని గ్రహింపవగుచున్నది. దశమ భాగము సమర్పించే ఈ విధానము భూమిపై ఒకే ఒక కుటుంబమున్నప్పుడు ఆరంభ మాయెనని తలంచుట యుక్తముకాదా? వారు ఈ లోకమంతా చెదరిపోయి, విగ్రహారాధనలో పడిపోయినను, దశమ భాగములిచ్చుట వారి మనస్సులలో ముద్రితమయియుండెను.

మానవుడు తన ఆదాయములో కొంతదేవునికి సమర్పించాలని అది దశమ భాగమని దేవుడు ఆదాముకు బోధించిన యెడల అట్టి అంశమును గూర్చి మనకు ఆదికాండములో కనబడును. లోభత్వము కయీను హృదయములోను, అననీయ సప్పీరాల హృదయములలోను ఉన్నట్లు చూడగలము. వారిచ్చిన దానికంటే ఎక్కువే యిచ్చినట్లు నటించడానికి ప్రయత్నించారు. ప్రతివారు దేవుని మోసపుచ్చుటకు ప్రయత్నించారు.

ఆదికాండములో దశమ భాగమును గూర్చిన చట్టం యేదీ లేదని కొందరు ఎదురాడవచ్చును. ఆదినుండియు నరహత్యను గూర్చిన చట్టముండెను. వ్యభిచార నిమిత్తమైన ఆజ్ఞ యున్నదని నీకేమైనా అనుమానమా? యూదా తన కోడలైన తామారు జారత్వము చేసెనని తలంచి "ఆమెను బయటికి తీసికొని రండి, ఆమెను కాల్చివేయవలెనని చెప్పెను" (ఆదికా 38:24). ఇచ్చుటను గూర్చిన ఆజ్ఞ యేమీ లేకపోతే దేవుడు కయీనును ఎందుకు శిక్షించెను? అబ్రాహాము దినము వరకు దశమ భాగమును గూర్చి చెప్పబడలేదని కొందరనవచ్చును. అట్లయితే వ్యభిచార నిమిత్తము, దొంగతనము నిమిత్తము కూడ మనము అట్లే అనవచ్చును గదా!

బైబిలులో మెల్కీ సెదెకు మొట్టమొదటిసారిగా యాజకుడని పిలువబడెను. షీనారువాడైన అమ్రాపేలు రాజని బైబిలులో మొదట చెప్పబడెను. అబ్రాహాము ప్రవక్తయని బైబిలులో మొదట చెప్పబడెను. ఈ ముగ్గురు జీవించేసరికి భూమి మీద అప్పటికే మానవులు చాలకాలము నుండి ఉనికి కలిగియుండిరి. అయితే మానవజాతి రాజులు, యాజకులు, ప్రవక్తలులేకుండా శతాబ్దములు తరబడి జీవించారని మనం తలంచవచ్చునా?

నోవహు నీతిపరుడని మొదట చెప్పబడెను. అబ్రాహాము దేవునియందు విశ్వాస ముంచిన వాడని చెప్పబడెను. అయితే వీరికంటేముందు హేబెలు, హానోకులు నీతిపరులని దేవునియందు విశ్వాసము గలవారని మనకు తెలుసు. దీనియంతటి భావం యేమంటే ఆదినుండియే దేవుడు కనీసం దశమభాగం కోరెను. మొదటి కుటుంబము నుండే దశమ భాగసమర్పణ ప్రపంచమంతా వ్యాపించెను.

**దశమ భాగచట్టము ఎప్పుడు అంతమ య్యెను?**

"దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞల వలన మన మీద రుణముగాను మనకు వరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దాని మీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెను" (కొలస్స 2:14).

యేసు సిలువపై చనిపోయినప్పుడు ధర్మశాస్త్రమును ఎత్తివేసెను. ధర్మశాస్త్ర ప్రకారము ప్రజలు ఆనాడు రక్త బలులనెట్లు అర్పించేవారో అట్లే దశమ భాగము కూడ అర్పించేవారు. "కాబట్టి మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకు డాయెను. అయితే విశ్వాసము వెల్లడి యాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" (గలతీ 3:24-25). "మీరు కృపకే గాని ధర్మశాస్త్రమునకు లోనైనవారు కారు గనుక పాపము మీమీద ప్రభుత్వము చేయదు" (రోమా 6:14). "తగ్గిపోవునదే మహిమ గలదైయుండిన యెడల నిలుచునది మరి ఎక్కువ మహిమ గలదై యుండును గదా" (2 కొరింథీ 3:11). ఈ వచనములను చదివిన తరువాత మోషే ధర్మశాస్త్రము ఇంకను అమలులో యున్నదని ఎవరు వాదించరు. అందువలన దశమ భాగమును గూర్చిన ఆజ్ఞకు మనం బద్ధులము కామని మనం ఊహించవచ్చును.

అట్లయితే క్రైస్తవ యుగములో మనం కానుకల నీయకూడదని దీని యర్ధమా? యూదులవలె మనమును ధారాళముగా ఇయ్యాలని దేవుడు కోరుటలేదా? నాలుగువేల సంవత్స రముల మట్టుకు ఎంత ఇయ్యాలో, ఎట్లు ఇయ్యాలో దేవుడు చెప్పిన తరువాత నీ యిష్టం వచ్చినంత తక్కువ ఇయ్యవచ్చునని ఆయన చెబుతున్నారా? నీకు నీవే పరీక్షించుకో.

మరల,అననీయ సప్పీరాలను దేవుడు కానుకల విషయమై అబద్ధ మాడినందున ఎందుకు చంపేసారు? "శాస్త్రుల నీతికంటెను పరిసయ్యుల నీతి కంటెను మీ నీతి అధికముకాని యెడల

మీరు పరలోక రాజ్యములో ప్రవేశింపనేరరని మీతో చెప్పుచున్నానని" యేసు ఎందుకు చెప్పారు? (మత్త 5:20). యేసు మాటలను వినుచున్నవారు దశమభాగము కంటే తక్కువ ఇయ్యవచ్చునని ఈ మాటల అర్థమా? క్రైస్తవులు దశమ భాగము కంటె తక్కువ ఇయ్యవచ్చునని చెబితే, క్రైస్తవ్యము కంటే, యూదామతము శ్రేష్టమని చెప్పుచున్నట్లుగదా?

క్రొత్తనిబంధన ధారాళముగా ఇచ్చుటను గూర్చి చెప్పుచున్నది

"బోధించువాడైతే బోధించుటలోను, హెచ్చరించువాడైతే హెచ్చరించుటలోను పని కలిగి యుందము, పంచి పెట్టువాడు శుద్ధ మనస్సుతోను, పై విచారణ చేయువాడు జాగ్రత్తతోను, కరుణించు వాడు సంతోషముతోను పని జరిగింపవలెను" (రోమా 12:8).

పాతనిబంధన దశమ భాగమును బోధించెను. క్రొత్త నిబంధన ధారళముగ ఇచ్చుటను బోధించుచున్నది. బైబిలు మనం దశమ భాగము ఇయ్యాలని బోధించుటలేదు. దశమ భాగము కంటె తక్కువ ఇయ్యాలని బోధించుటలేదు. మనం ధారాళముగా ఇయ్యాలని బోదించుచున్నది. మనకున్న తరుణములు అధికం గనుక మన బాధ్యతలు కూడ అధికమే. లూకా 12:48 చదువుము. యూదామతము ఒక్క జనాంగమునకు చెందినదే గాని క్రైస్తవ్యము అన్ని జనాంగములకు చెందినది. గనుక మన బాధ్యతలు అధికం. దశమ భాగము కంటె తక్కువ యిచ్చిన వారిని గూర్చి బైబిలులో మనం చదువము. బర్నబా, బీదవిధవరాలు తమకు కలిగిన దంతయు యిచ్చేసారు. నీవెంత ఇస్తావు?

-V.P.బ్లేక్

ప్రకటన గ్రంథ ఉపదేశమాలిక - 33

# పరదైసును తిరిగి పొందుట
(Paradise Regained)

పరిచయము :

దేవుడు మానవుని చేసినప్పుడు అతని పరదైసు వలెనున్న ఏదేను వనంలో యుంచారు. ఆదాము హవ్వలు పాపము చేసినప్పుడు ఆపరదైసును కోల్పోయారు. మానవ జాతినంతటిని పాపములో పడవేసారు .

అయితే శుభవార్త యేమంటే ఆ పరదైసు తిరిగి సంపాదించబడింది,

యేసుక్రీస్తు సిలువ మరణము ద్వారా యిది సాధ్యపరచబడింది.

ఈ పరదైసును గూర్చి కొంచెం లోతుగా ఆలోచింతము.

**1. తిరిగి సంపాదించబడిన పరదైసు (22:1-5).**

ఈపరదైసులో జీవజలనది యున్నది. దానియొద్దకు రాజమార్గముండెను(1వ) ఏదెనువనము నుండి వెళ్లిన నది యొకటి యుండెను. అది నాలుగుశాఖలైయుండెను (ఆదికా. 2:10-14). ఈజీవనదియైతే దేవుని యొక్కయు గొర్రెపిల్ల యొక్కయు సింహాసనము నుండి ప్రవహించు చుండెను. దాని యందలి నీరు స్పటికము వలె మెరయుచుండెను. అది పరలోక పట్టణపు రాజవీధి మధ్య ప్రవహించు చుండెను. ఆనది యొక్క ఇరువైపుల జీవ వృక్షముండెను. ఈజీవనదికి మన ప్రవేశమును గూర్చి అనేక లేఖనభాగ ములలో చూడ వచ్చును.

a) క్రీస్తు మన గొర్రెలకాపరి. ఆయన మనలను జీవజలముల బుగ్గల యొద్దకు నడిపించును (ప్రకటన 7:17).

b) "దప్పిగొను వానికి జీవజలముల బుగ్గలోని జలమును నేను ఉచితముగా అనుగ్రహింతును" అని ప్రక 21:6 చెప్పుచున్నది.

c) కీర్తన 46:4 లో "ఒక నది కలదు; దానికాలువలు దేవుని పట్టణమును సర్వోన్నతుని మందిరమును పరిశుద్ధ స్థలమును సంతోష పరచుచున్నవి" యని దావీదు వ్రాసాడు.

d) "నేనిచ్చు నీళ్లు త్రాగువాడె వ్వుడును దప్పిగొనడు; నేను వానికిచ్చునీళ్లు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని" యేసు చెప్పెను (యోహాను 4:14).

**2. పరదైసులో జనములకు జీవ వృక్షము లభ్యమగును (2వ)**

ఈ జీవ వృక్షము ఏదేను మధ్య యుండినట్లు ఆదికా. 2:9 చెప్పుచున్నది. దాని ఫలమును తినువారు నిరంతము జీవిస్తారు (ఆదికా 3:22).

ఈ జీవ వృక్షము బంగారువీధుల మధ్యను, జీవజలనదికి ఇరువైపులను ఇప్పుడు కనబడుచున్నది. అది నెల నెల పండ్రెండు కాపులు కాయును.

దాని ఆకులు జనములను స్వస్థపరచును.

జయించు వానికి జీవ వృక్షఫలములను ప్రక 2:7లో యేసువాగ్దానము చేసారు.

**3. పరలోకములో శాపగ్రస్థమైన దేదియు వుండదు (3వ)** ఆదాము హవ్వలను శోధించిన తరువాత సర్పము శపించబడెను (ఆదికా. 3:14).

ఆదాము హవ్వలు, మరియు ఈ భూమి కూడ పాపము వలన శపించబడెను (ఆదికా 3:16 -19).

గనుక పరలోకములో బాధ యుండదు,

వేదన దుఃఖము, ఆకలి, దప్పిక, మరణము, ఏడ్పు యేమివుండదు.

**4. దేవుని యొక్కయు గొఱ్ఱెపిల్ల యొక్కయు సింహాసనము అక్కడ వుండును.**

సింహాసనము దేవుని శక్తికి అధికారమునకుగురుతు. అవును సర్వశక్తి మంతుడైన దేవుడు అక్కడ వుండును. నిజంగా "ఈలోక రాజ్యము మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తు రాజ్యము నాయెను. ఆయన యుగ యుగములు ఏలును" (ప్రక 11:15).

**5. పరలోకము పరిచర్యలేక సేవ చేసే ప్రదేశము (4వ)**

"ఆయన దాసులు ఆయనను సేవింతురు" ఆదాము హవ్వలు ఏదేను వనమును కాయుటకును దానిని సేద్య పరచుటకును దానిలో యుంచబడిరి. (ఆదికా 3:15). మొదటిపరదైసులో పరిచర్యచేయవలసిన విధి యుండెను.

పరలోకములో దేవునికి భావపూరితమైన సేవ చేయవలసి యున్నది. ఆయనను సేవించుట యనగా, ఆయన నారాధించుట.

సొలొమోను రాజును దర్శించిన షేబరాణి "నీజనులు భాగ్య వంతులు. నీ ముందర ఎల్లప్పుడును నిలిచి నీజ్ఞాన వచనములను వినుచుండు నీ సేవకులును భాగ్యవంతులు" అని చెప్పెను (1రాజులు 10:8). మనము కూడ దేవుని సేవకులుగా భాగ్యవంతులమే.

**6. పరలోక గృహములో మనం ఆయన ముఖాన్ని చూతుము.**

నిర్గమ 33:20లో "ఏనరుడును నన్నుచూచి బ్రతుకడని" దేవుడు చెప్పారు. "ఎవడైనను ఎప్పుడైనను దేవుని చూడలేదు" అని యోహాను 1:18లో చెప్పబడియున్నది.

గానిక్రైస్తవులు ఒక దినమందు దేవుని ముఖాన్ని చూతుమనే నిరీక్షణతో జీవించుదురు.

"హృదయ శుద్ధి గల వారు ధన్యులు వారు దేవుని చూచెదరు" (మత్తయి 5:8). హెబ్రీ 12:14 నుకూడ చూడుము.

పునరుత్థానమందు దేవుని ముఖదర్శనము చేయుదననే నిరీక్షణ దావీదు కలిగి యుండెను. "నేనైతేనీముఖదర్శనము చేసెదను. నేను మేల్కొనునప్పుడు నీ స్వరూపదర్శనముతో నా ఆశను తీర్చుకొందును" (కీర్తన 17:15).

**II. ఆరవ ధన్యత (22:6-7)**

మన పరలోక గృహాన్ని గూర్చి చెప్పబడెను; ఈ మాటలు నమ్మకములును సత్యములునై యున్నవి". వీటిని మనం నమ్మవచ్చును.

"ఇదిగో త్వరగా వచ్చుచున్నానని" యేసు వాగ్దానము చేసారు. ఆయన ముందు హెచ్చరిక లేకుండా అకస్మాత్తుగా వచ్చును.

అందువలన "ఈ ప్రవచన వాక్యములను

గైకొనువాడు ధన్యుడు ". ప్రక 1:3 లో చెప్పబడిన మొదట ధన్యత కూడ ఇంచుమించు యిదే. కొందరు ఆసక్తి కలిగియుండినను వాక్య జ్ఞానము లేనివారు. మరికొందరికి వాక్యజ్ఞానమున్నను ఆసక్తి యుండదు. ఈ ధన్యత గలవారు ఆసక్తి, జ్ఞానముకూడ కలిగినవారే, యూదులు దేవుని యందు ఆసక్తిగలవారు. "అయినను వారి ఆసక్తి జ్ఞానాను సారమైనది కాదు" (రోమా 10:2). మత శాఖలలో యున్న అనేకులు యూదుల వలె ఆసక్తి గలవారు. క్రీస్తు సంఘములో యున్న అనేకులకు జ్ఞానమున్నదిగాని ఆసక్తి శూన్యులు.

**3. దేవ దూతార్చన ఖండించబడెను (22:8-9).**

ఆయా సంగతులను చూపుచున్న దూత పాదముల యెదుట ఆరాధించుటకు యోహాను సాగిలపడగా అతడు నివారించబడ్డాడు. (ప్రక 19:10).

కొలస్స 2:18లో కూడ పౌలు దేవదూతారాధనను ఖడించాడు.

మనం దేవుని మాత్రమే ఆరాధించాలి. యోహాను 4:24; మత్తయి 4:10.

**4. ఈ గ్రంధమునకు ముద్రవేయరాదని దేవుడు యోహాను చెప్పారు(22:10-11).**

తాను వ్రాయుచున్న గ్రంధమునకు ముద్ర వేయవలెనని ముమ్మారు దానియేలుకు చెప్పబడెను (దాని 8:26, 12:4,9).

కాలము సమీపమై యున్నదిగనుక యోహాను ఈ ప్రవచన వాక్య గ్రంధమునకు ముద్ర వేయవలదని చెప్పబడెను (10వ)

అందువలన "అన్యాయము చేయువాడు ఇంకను అన్యాయ మే చేయనిమ్ము, అపవిత్రుడైన వాడు ఇంకను అపవిత్రుడుగానే యుండనిమ్ము, నీతిమంతుడు ఇంకను పరిశుద్ధుడుగానే యుండనిమ్ము".

కాలము సమీపమైయున్నదిగాన అపవిత్రులు అపవిత్రులుగానే యుంటారు. నీతిమంతులు నీతిమంతులుగానే యుంటారు. వాక్యపు వెలుగులో అపవిత్రుడు ఇంకా అపవిత్రుడుగాను, నీతి మంతుడు ఇంకా నీతి మంతుడుగాను అగుపడును. ఇంకోమాటలో చివరిఘడియలో అటు యిటు మార్పుజెందుటకు అవకాశము ఎవనికి చిక్కదు.

దుర్జనులు ఇతరులను మోసపరచుచు అంతకంతకు చెడిపోవుదురని పౌలు 2 తిమోతి 3:13లో వ్రాసాడు.

ముగింపు :

ఆదికాండము 2,3 అధ్యాయాల్లో మానవజాతి పరదైసును కోల్పోయారు. పరదైసు పునరుద్ధరించబడిందని సిలువపైనున్న దొంగతో యేసు చెప్పిన మాటలలో మనం గ్రహించుకోగలము. "నేడు నీవు నాతో కూడ పరదైసులో

యుందువని " యేసు అతనితో చెప్పారు (లూకా 23:43). పౌలు పరదైసును చూచాడు (2 కొరింథీ 12:1-4). జయించిన వారికది వాగ్దానము చేయబడినది (ప్రక 2:7). ప్రకటన 22లో అది పునరుద్ధరించబడింది.

నమ్మకమైన క్రైస్తవులకు వరనా తీతమైన అనుభవం ఎదురు చూచుచున్నది. పరలోకంలో బంగారు వీధులలో నడుచుచు జీవనది యొక్క జలములను ఆస్వాదించుట ఎంత ధన్యకరము !!

## యెహోవా మనకు గొప్ప కార్యములు చేసి యున్నారు.

(The Lord hath done Great things for us)

"యెహోవా మనకొరకు గొప్ప కార్యములు చేసి యున్నాడు. మనము సంతోషభరితులమైతిమి " (కీర్తన 126 :3). ఈ లోకములో ప్రతి ఒక్కరు ఆనంద దాయకమైన జీవితమును జీవించవలెనని కాంక్షించుచుందురు. ఈ జీవిత యాత్రలో వివిధ రకములైన ఆనందములు గలవు. అయితే ఈ ఆనందము దేవుని నుండి కలిగినట్టయిన నిజముగ అది చాల ధన్య కరమైనది. మన దేవుడైన యోహోవా చాల గొప్ప దేవుడు. ఆయన చేసిన పనులన్నియు చాల ఘనమైనవి. ఆశ్చర్యకరమైనవి. ఈ భూమి పై నివసించు మానవుని యొక్క సంతోషకరమైన జీవితము కొరకు దేవుడు భూమిని, దాని యందలి సమస్తమును పరలోకమును సృష్టించి యున్నారు.

నరుల యొక్క చెడుతనము భూమిపై చాల అధికమైనందున యెహోవా భూమి మీద నుండి నరుని నశింపచేయ తలంచెను. అయితే నోవహు దేవుని దృష్టిలోదయ పొందిన వాడాయెను. భూమిపైనుండి సమస్త జీవరాసులు పూర్తిగ నిర్మూలించ బడినది. దేవుడు నోవహు యెడలను తనకుటుంబము యెడలను గొప్పకార్యములను చేసెను. ఎట్లనగా వారు జలప్రళయము నుండి తప్పింపబడిరి. అబ్రహాముకు నూరు ఏండ్లు శారాకు తొంబది యేండ్ల వయస్సున్నప్పుడు వారికి ఇస్సాకును

గర్భఫలముగ యిచ్చుటద్వారా వారికి ఆనందము కలుగజేసెను. దేవుడు ఇస్సాకును ఆశీర్వదించెను. ఎట్లనగా ఇస్సాకు ఆదేశమందున్నవాడై విత్తనము వేసి ఆ సంవత్సరము నూరంతలు ఫలము పొందెను. యెహోవా అతనిని ఆశీర్వదించెను గనుక ఆమనుష్యుడు గొప్ప వాడాయెను. అతడు మిక్కిలి గొప్పవాడగు వరకు క్రమక్రమముగ అభివృద్ధి పొందుచు వచ్చెను. అతనికి గొఱ్ఱెల ఆస్థియు, గొడ్ల ఆస్థియు, దాసులు, గొప్ప సమూహము కలిగినందున ఫిలిష్తీయులు అతని యందు అసూయపడిరి. (ఆది.కా. 26-12:14).

దేవుడు యాకోబు జీవితములో చాల గొప్పకార్యములు చేసెను. దేవుడు అబ్రహాముకు చేసిన వాగ్దానమును అతని యొక్క వారసుల ద్వారా నెరవేర్చబడెను. యోసేపు జీవితములో దేవుడు గొప్ప కార్యములు చేసెను. ఎట్లనగా అతడు ఐగుప్తు వర్తకులకు బానిసగా అమ్మబడినప్పటికిని. ఐగుప్తు దేశమునకు ఫరోరాజు తరువాత ఫరో అంతటి ఏలికగా దేవుడు యోసేపును దీవించెను. (ఆది.కా. 50:20).

మోషే జీవితములో దేవుడు గొప్ప కార్యములు చేసెను. ఫరోయొక్క క్రూరమైన ఆజ్ఞను బట్టి బాలుడైన మోషే చంపబడ వలసియుండెను. కాని గొప్ప దేవుడు మోషేను మరణమునుండి తప్పించి, ఫరోయింటిలోనే రాజకుమారునిగ తన తల్లిద్వారానే పెంచబడెను (నిర్గమ 2:1-9). దేవుని యొక్క బలమైన హస్తము ఇశ్రాయేలీయులను ఐగుప్తు దాసత్వము నుండి విడిపించెను ఐగుప్తీయులను పది తెగుళ్ల ద్వారా బాధించెను. ఇశ్రాయేలీయులకు వాటిని గూర్చిన బాధ యేమియు లేక పోవుటచే దేవుడు మహోన్నతుడైన దేవునిగ నిరూపింపబడెను. ఎఱ్ఱసముద్రమును పాయలుగ చేసి ఫరో సైన్యము నుండి ఇశ్రాయేలీయులను తప్పించెను (నిర్గమ 14:21-31). ఇశ్రాయేలీయులు ఐగుప్తీయులకు కలిగిన నాశనమును చూచి దేవునికి భయపడిరి. (నిర్గమ 14: 21-31). నలుబది సంవత్సరములు మన్నాను ఆకాశమునుండి కురిపించి, బండల నుండి నీటిని రప్పించి, ఆకాశ పక్షులైన పూరేళ్ల ద్వారా వారికి మాంసము నిచ్చి అరణ్యములో పోషించెను.

ఇశ్రాయేలీయులు కనాను దేశమును స్వాస్థ్యముగ పొందుటకు ఎన్నో గొప్పకార్యములను దేవుడు వారి కొరకు చేసెను ఆ దేశముల రాజులందరిపైన వారికి విజయములనిచ్చెను. రూతు, నయోమి, హన్న, దావీదు, యోబు, షద్రక్ ,మేషక్ అబెద్నెగో, దానియేలు అనువారి

ప్రతములలో యెన్నెన్నో గొప్పకార్యములు దేవుడు చేసెను.

కన్యయైన మరియ జీవితములో దేవుడు గొప్పకార్యము చేసెను. సర్వశక్తి మంతుడు నాకు గొప్ప కార్యములను చేసెను గనుక ఇది మొదలు కొని అన్ని తరముల వారు నన్ను ధన్యురాలని యందురు, ఆయన నామము పరిశుద్ధము అని ఆమె చెప్పుచున్నది. (లూకా 1:49) వృద్ధులైన జెకర్యా, ఎలిజబెతులకు వృద్ధాప్యములో వారికి బాప్తిస్మమిచ్చు యోహానును కుమారునిగా అనుగ్రహించుట ద్వారా వారి జీవితములో గొప్పకార్యము దేవుడు చేసెను. యేసు ప్రభువు ఈ భూలోకములో యుండినపుడు కుష్ఠరోగుల యెడల, చెవుడు, మూగ గలవారి యెడల, గ్రుడ్డివారి యెడల, దయ్యములు పట్టి పీడింపబడుచున్న వారి యెడల , 12 సంవత్సరముల నుండి రక్తస్రావ రోగముచే బాధింపబడుచున్న స్త్రీ యెడల, నానా విధములైన రోగములచే బాధింపబడుచున్న వారి యెడల ఆయన అనేక గొప్పకార్యములను చేసి వారందరిని స్వస్థపరచెను. మృతుడైన విధవరాలి కుమారుని బ్రతికించెను. యాయీరు కుమార్తెను, లాజరును బ్రతికించెను. పాపములో మునిగి పోయిన ఈలోక ప్రజలందరిని వారి పాపములనుండి రక్షించుటకు గాను దేవుడు తన అద్వితీయ కుమారుని ఈలోకములోనికి బలిగా పంపించుట ద్వారా ఆయన ఈలోక ప్రజలందరి యెడలను గొప్ప కార్యములు చేసెను. యేసుప్రభువును మరణము నుండి సజీవునిగా లేపుట ద్వారా మనకు నిత్యజీవమును గూర్చిన నిరీక్షణ అనుగ్రహించుట ద్వారా ఆయన మన యెడల గొప్ప కార్యము జరిగించెను.

మన బలహీనత లెన్నియైనప్పటికిని మనలో ప్రతి ఒక్కొక్కరి జీవితములలో మన యెడల యెన్నెన్నో గొప్పకార్యములను దేవుడు చేయుచున్నారు. ఆయన మన యెడల జరిగించుచున్న మేళ్లన్నిటి విషయము లోను మన మాయన కేమి చెల్లించగలము! సమరయుడైన కుష్టరోగి వలె శుద్ధుడై ఆయనకు కృతజ్ఞతలు చెల్లించుటకు తిరిగి వచ్చిన వాడెవడును లేడా? నీవిశ్వాసమే నిన్ను స్వస్థపరచెను అని యేసు అతనికి చెప్పెను.

యేసు ప్రభువు గెరాసేనుల దేశమునకు వచ్చినపుడు అపవిత్రాత్మపట్టిన యొకనిని ఆయన స్వస్థ పరచి వానితో, " నీవు నీయింటివారి యొద్దకు వెళ్లి ప్రభువు నీయందు కనికరపడి, నీకు చేసిన కార్యములన్ని వారికి తెలియజెప్పుము" అనెను (మార్కు 5:20).వాడు వెళ్లి యేసు తనకు చేసిన వన్నియు దెకపొలిలో ప్రకటింపనారంభిపగా అందరూ ఆశ్చర్యపడిరి.

యెహోవాకు కృతజ్ఞత స్తుతులు

చెల్లించుడి, ఆయన నామమును ప్రకటన చేయుడి జనములలో ఆయన కార్యములను తెలియజేయుడి ఆయనను గూర్చి పాడుడి, ఆయనను కీర్తించుడి. ఆయన ఆశ్చర్యకార్యములన్నిటిని గూర్చి సంభాషణ చేయుడి అని కీర్తనా కారుడు వ్రాస్తున్నాడు (కీర్తనలు 105:1-2).

మనము దేవుని సన్నిధికి యెట్లు వెళ్లవలెను? దహనబలి అర్పించుట ద్వారాను లేక ఏడాది లేత దూడతోను లేక వేలాది పొట్టేళ్లతోను , పదివేల నదులంత విస్తార తైలముతోను మన జీవితములలో ఆయన చేసిన మేళ్లు కొరకై ఆయనకు అర్పించుదమా? దేవుని ద్వారా ఈయబడినవి గాక మరి యిక మనకు ఎవరైనా యేమేళ్లయిన అనుగ్రహించిరా?(1 కొరింధీ 4:7). ప్రతి మేలును ఈవియు మనకు జ్యోతిర్మయుడగు తండ్రియైన దేవుని నుండియే కలుగుచున్నది. కనుక మన కీర్తనాకారుని వలె దేవుని నుండి మనము పొందుచున్న ప్రతివేలు విషయ ములోను, మనలను ప్రేమించి మనలను సంతోషవంతులగు చేయుటకుగాను మన జీవితములలో చేయుచున్న ప్రతి మంచి విషయముల లోను యెల్లప్పుడును దేవునికి కృతజ్ఞతలు చెల్లించుదము.

- కవితా గూటం

## గమనిక

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న
సత్యవాణి T.V కార్యక్రమములను
దిగువ సమయాల్లో తప్పక చూడండి

ప్రతి ఆదివారం ఉదయం 6.30 గం॥కు రక్షణ ఛానల్ ప్రతి
సోమవారం ఉదయం 6.00 గంటలకు
శుభవార్త ఛానల్‌లో
ప్రతి బుధవారం ఉదయం 7:00 గంటలకు విస్సా ఛానల్‌లో
ప్రతి శనివారం ఉదయం 6.30 గం॥లకు రక్షణ ఛానల్

# పౌలు సువార్త ప్రయాణములు

క్రీస్తును గూర్చి పౌలు ప్రభావితుడైనంతగా అపోస్తలులలో మరెవ్వ రునూ కాలేదేమో యని అనిపిస్తుంది. ఆయన అన్యుల మధ్యన సంఘమును స్థిరముగా స్థాపించెను. క్రొత్తనిబంధనలోని గ్రంధములలో సగము ఈయనే రాశాడు. అపోస్తలుల కార్యముల గ్రంధములో 8వ అధ్యాయము మొదలుకొని 28 వరకు ప్రధాన పాత్రధారి ఈయనే. ఆయననుగూర్చి సంపూర్ణముగా తెలుసుకొనుటవల్ల మనం ఎంతైనా మేలు పొందగలం.

స్తెఫను రాళ్ళతో కొట్టబడిన తరువాత యెరూషలేములోని సంఘమునకు గొప్ప శ్రమ సంభవించెను. ఫలితముగా వారు యూదయ సమరయ ప్రాంతములలో చెదరిపోయిరి. ఇది కీడులో మేలువలె పరిణమించింది. ఎలాగంటే చెదరిపోయినవారు సువార్త ప్రకటించుచూ వెళ్ళిపోయారు. ఫిలిప్పు అనే సువార్తకుడు సమరయలోని ఒక పట్టణములో చాలామందిని మార్చాడు. వారిలో గారడీవాడైన సీమోను ఒకడు. ఆ తరువాత ఫిలిప్పు దేవుని ఆత్మ ద్వారా నడిపించబడి యెరూషలేమునుండి గాజాకు పోవు మార్గమున పోవుచున్న కందాకేరాణి ధనాగారపు అధికారియైన నపుంసకుని కలుసుకొని అతనికి సువార్త ప్రకటించి అతనిని మార్చాడు. అతను తన స్వదేశానికి వెళ్ళి తన స్వంత ప్రజలను తిప్పగా సువార్తవైపు మళ్ళించి వుంటాడు.

సంఘమునకు సంభవించిన ఈ శ్రమ కొంతమట్టుకు సౌలు అనే యౌవనస్తుని మూలముగా సంభవించింది. అతను దమస్కు వెళ్ళి అచ్చటి క్రైస్తవులను బంధించుటకు పత్రములు పొందాడు. మార్గములో గొప్ప వెలుగు కనబడుటవల్ల అతను క్రిందపడిపోయాడు. అంతట అతను యేసు స్వరాన్ని విన్నాడు. దమస్కునకు వెళ్ళు అచ్చట నీకు ఏమి చేయాలో చెప్పబడతాదని యేసు చెప్పాడు. దమస్కు వెళ్లి మూడు రాత్రింబవళ్ళు ఆయన వుపవాసము నుండి ప్రార్థన చేశాడు. చివరికి అననీయ అనే శిష్యుడు క్రీస్తుయొద్దకు నడిసపించటానికి వచ్చాడు. సౌలు క్రైస్తవుడయ్యాడు. ఇప్పుడు పౌలుగా పిలవబడుతున్నాడు. ఒకసారి తాను నిరాకరించిన విశ్వాసాన్ని ప్రకటించటం మొదలు పెట్టాడు.

మనం కొంతసేపు అపోస్తలుడైన పేతురుయొక్క విషయాన్ని పరిశీలిద్దాం. ఈయన లుద్దలో పక్షవాయువుతో

బాధపడుచున్న 'ఐనెయా'ను స్వస్థపరచెను. జొప్పాలో చనిపోయిన "తబిత"ను బ్రతికించెను. ఈ సంఘటనలవల్ల అనేకులు క్రైస్తవు లయ్యారు. అతను యొప్పేలో వుంటుండగానే కైసరయలో వుంటున్న రోమా పటాలపు శతాధిపతియైన కొర్నెలియొద్దనుండి ఆహ్వానం అందుకున్నాడు. అతని పిలుపును అంగీకరించమని పేతురు ప్రభువుతో ఆజ్ఞాపించబడ్డాడు. పేతురు విధేయత చూపించాడు. ఫలితంగా అన్యులలో నుండి మొట్టమొదటిగా కొర్నేలి అతని యింటివారు ప్రభువును అంగీకరించారు. యూదులనుండి క్రైస్తవులైనవారు కొంతమంది ఈ విషయమునుగూర్చి పేతురును ప్రశించారు. పేతురు కొర్నేలిని గూర్చిన విషయాన్నంతటినీ వివరించగా వారు చాలా సంతోషించారు. కానీ సంఘమునకు మరలా శ్రమలు ప్రారంభమయ్యాయి.

మొదటి సువార్త ప్రయాణము

పౌలు, బర్నబా అను మరియొక సువార్తికుడు కలసి సిరియాలోని అంతియొకయలోని సంఘములో పనిచేశారు ఈ పట్టణం నుండే వారి మొదటిప్రయాణాన్ని మొదలు పెట్టారు. వారు ఓడ ఎక్కి ప్రస్తుతం "టర్కి" అని పిలువబడుచున్న చిన్న ఆసియాకు 'కుప్ర' అనే ద్వీపము మీదుగా ప్రయాణమై వెళ్ళారు. 'పెర్గ' అనేచోట దిగారు. ఇచ్చట నుండి వారితో వచ్చిన బర్నబాజ్ఞాతియైన 'జాన్ మార్క్' తిరిగి వెళ్ళి పోయాడు. వారు ముందుకు సాగిపోయి పిసిదియాలోనున్న అంతియొకయలోను. లుస్త్రలోను ఈ కొనియాలోను దెర్బిలోను సంఘములను స్థాపించిరి. వారు చాలామంది వ్యతిరేకించినా సువార్త ప్రకటించుచూ ముందు సాగిపోయారు. లుస్త్రాలో పౌలు రాళ్ళతో కొట్టబడ్డాడు. వారు మరలా తిరిగి వచ్చేటప్పుడు ప్రతీ పట్టణములోనున్న సంఘములలో పెద్దలను ఏర్పాటుచేసి వారు ప్రయాణం ప్రారంభించిన సిరియాలోని 'అంతి యొకయ'కు తిరిగి వచ్చారు.

పౌలు బర్నబాలు వెంటనే యెరూషలేమునకు ప్రయాణమై వెళ్ళారు అచ్చట యూదులనుండి క్రైస్తవులుగా మారినవారు అన్యులు నుండి క్రైస్తవులుగా మారినవారిని సున్నతి చేయించుకొనమని బలవంతం పెట్టుట విషయమై చర్చించారు. అప్పుడు సున్నతి అనునది మోషే ధర్మశాస్త్రములో ఒక భాగం కానీ క్రీస్తు సువార్తలో చేరినది కాదు అని నిర్ధారించారు.

రెండవసువార్త ప్రయాణము

పౌలు, బర్నబాలు అంతియొకయకు తిరిగివచ్చి తాము క్రొత్తగా

స్థాపించిన సంఘాలను తిరిగి దర్శించాలని నిశ్చయించుకున్నారు. కానీ తమతో మొదటవచ్చిన మార్కును తమతో తీసుకువెళ్ళాలా లేదా అనే సమస్య వారికి తల ఎత్తింది ఎందుకంటే మార్కు మధ్యలో తిరిగి వచ్చేశాడు. కనుక బర్నబా మార్కును వెంటబెట్టుకొని కుప్రకు ప్రయాణమై ఓడ ఎక్కిపోయాడు. పౌలు శీలను వెంటబెట్టుకొని క్రొత్త సంఘాలను దర్శించుటకు భూమార్గమున బయలు దేరి చిన్న ఆసియాకు ప్రయాణమయ్యాడు. అచ్చటనుండి క్రొత్తగా మారిన యౌవనస్థుడైన తిమోతిని వెంటబెట్టుకొని త్రోయకు వెళ్ళాడు. ఇచ్చట పౌలునకు ఒక దర్శనము వచ్చింది. మాసిదోనియా మనుష్యుడు పౌలును తమకు సహాయముచేయుమని పిలుస్తున్నట్లు దర్శనం వచ్చింది. ఈ ఆహ్వానాన్ని పురస్కరించుకొని పౌలు ఐరోపాలోనున్న 'ఫిలిప్పీ'లో సువార్త ప్రారంభించాడు. ఐరోపాలో పౌలు పని ప్రారంభించిన మొదటి పట్టణము. ఇచ్చట వ్యాపారస్తురాలైన లూదియా ఆమె భర్త సువార్తను అంగీకరించారు. తరువాత పౌలు చెరసాల అధిపతి అతని కుటుంబాన్ని ప్రభుయొద్దకు నడిపించారు. అచ్చటనుండి వారు థెస్సలోనిక, బెరియా అను పట్టణములకు వెళ్ళి సంఘములను స్థాపించారు. ఈ ప్రాంతమందు యూదులు గట్టిగా ఎదురునిలచినందున అచ్చటనుండి పౌలు ఏథెన్సునకు వెళ్ళాడు. ఇచ్చట కొండమీద తన ప్రఖ్యాత ప్రసంగాన్ని చేశాడు. తరువాత కొరింథు పట్టణం వెళ్ళి అచ్చట సంఘాన్ని స్థాపించి 1.1/2 సం॥లు వుండి సువార్త ప్రకటించాడు. చివరిగా ఆయన యూదయకు సముద్రమార్గమున ఓడ ఎక్కి ప్రయాణమై మధ్యలో ఎఫెసును దర్శించాడు. యెరూషలేములో కొద్దికాలముండి అంతియొకయకు తిరిగివచ్చాడు.

## మూడవ సువార్త ప్రయాణము

పౌలు తన మూడవ ప్రయాణము నందు గలతియ, ఫ్రుగియ ప్రాంతములను దర్శించెను. ఆయన ఎఫెసునకు వచ్చి మూడు సంవత్సరములు అచ్చట వుండి తురన్న స్కూలులో బోధించెను. మిగిలిన ప్రాంతములలోవలెనే చాలామంది అతనిని వ్యతిరేకించిరి. అతను అచ్చటనుండి మాసిదోనియాకు అకయాకు ప్రయాణమై వెళ్ళి అచ్చటి సంఘములను దర్శించెను. అచ్చటినుండి వెనుదిరిగి త్రోయగుండా ఓడ ఎక్కి యూదుల పండగయైన 'పెంతెకోస్తు' పండుగకు హాజరగుటకు యూదయకు ప్రయాణమయ్యెను. మార్గమధ్యమున ఎఫెసి పెద్దలను కలుసుకొని కొద్దిసేపు వారితో మాట్లాడెను.

**పౌలు బంధించబడుట**

పౌలు ఎక్కడికి వెళ్ళినా అచ్చట యూదులు అతనికి వ్యతిరేకముగా రెచ్చిపోయారు. యెరూషలేమునకు వచ్చిన వెంటనే అతనిని చంపవలయునని శపథము చేసిన యూదులనుండి రక్షించుటకు రోమా సైనికులు పౌలును అరెస్టుచేశారు (బంధించారు). యూదయాజైలునందు ఆయన రెండు సంవత్సరాలున్నాడు. ఆయన జైలులో వుండగానే యూదుల సభవారు, ఫేస్తు, ఫెలిక్సు అను ఇద్దరు గవర్నరులు, అగ్రిప్ప అనే రాజుకూడా ఆయనను విచారించారు కానీ ఎవరు శిక్ష విధించలేదు. చివరిగా తనకు కలిగిన రోమా పౌరసత్వపు అధాకారమును వినియోగించుకొని రోమా చక్రవర్తికి విన్నవించుకున్నాడు ఆయన రోమా ప్రయాణము తుఫానుద్వార అడ్డగించబడి ఓడ బ్రద్దలై 'మెలెతు' అనే ద్వీపానికి వారు చేరుకున్నారు. అందరూ బ్రతికి బయటపడ్డారు. 3నెలల తరువాత వారందరూ రోమాకు బయలుదేరారు. అపోస్తలుల కార్యములు గ్రంథము ద్వారా మనకు అర్థమయ్యే దేమిటంటే పౌలు రోమాలో ఖైదీగా వున్నట్లే వ్రాయబడింది. కానీ పౌలుగారు మరలా అరెస్టు చేయబడినట్లు తెలుస్తున్నది. పారంపర్యముగా చెప్పబడే దేమిటంటే – ఈ గొప్ప దైవజనుడు క్రీస్తుశకం 67లో రోమా పట్టణంలో శిరచ్ఛేదనం గావించబడ్డాడని చెప్తూతారు.

**పౌలు సందేశం – సువార్త**

"అయ్యో సువార్తను ప్రకటించనియెడల నాకు శ్రమ" అని 1కొరి. 9:16లో పౌలు చెప్పుచున్నాడు. తనను రక్షించిన సువార్తను యితరులకు అందించాలని అతని ఉద్దేశం. 'సువార్త' అనగా మంచి సందేశమని యర్థము. అది క్రీస్తు యొక్క మరణము, సమాధి. పునరుత్థానమని పౌలు చెప్పుచున్నాడు (1కొరి15:1-4).ఎందుకు శుభవర్తమానం అయ్యిందంటే ప్రభువుయొక్క సమాధి పునరుత్థానముల ద్వారా మానవులకు పాపక్షమాపణ కలుగుచున్నది కాబట్టి. కనుక పౌలు రోమా 1:16లో యీలాగు చెప్పుచున్నాడు – "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను ఏల యనగా నమ్ముప్రతివానికి మొదట యూదునికి, గ్రీసుదేస్థునికికూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది".

# సంక్షిప్త వార్తలు

2009 మార్చి 16వ తేదీనుండి 21 వ తేదీవరకు రిక్కీ గూటం గారు, ఢిల్లీనుండి వచ్చిన వినయ్ దేవిడ్ గారు కలిసి ఒరిస్సా రాష్ట్రములో సువార్త చాటించిరి. రిక్కీ గారు ముఖ్యముగా ఒరిస్సాలో హింసల నెదుర్కొని యున్న వారికి తగు రీతిగా సహాయము చేయునిమిత్తము అక్కడికి వెళ్లిరి. వారు పలు ప్రాంతములు, గ్రామములు దర్శించి విశ్వాస నిమిత్తమైన బాధలనొందినవారిని వాక్య రూపముగా ఆదరించి కొందరికి దుప్పట్లు, చీరలు, ఒరియా బైబిళ్లు ఉచితముగా అందజేసిరి. ఫిబ్రవరి నెలలో కబితాగూటం గారు కూడ కంధోమల్ విశ్వాస బాధితులకు ఉన్ని దుప్పట్లు , చీరలు, బైబిళ్లు, బియ్యము వగయిరా తమ చేతుల ద్వారా అందజేసిరి. రిక్కీగార్కి నీలేంద్ర ఛత్రియా, వికాస్‌దీప్ అను సోదరులు ఒరియా భాషలోనికి తర్జుమా చేసి సహాయపడిరి. ఆరుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

మార్చి 27వ తేది శుక్రవారం అమెరికానుండి జెర్రీబేట్స్ దంపతులు రాజమండ్రి విమానాశ్రయములో దిగిరి. విమానాశ్రయం నుండే రిక్కీగారు వారిని పోలమూరు పాడులో ఏర్పాటు చేయబడిన కూటమునకు తీసికొనివెళ్లిరి. అక్కడ డి.జె ప్రకాశ్ గారు పరిచర్యచేయుచున్నారు. ఆరుగురు బాప్తిస్మము పొందిరి. అదేరోజుసాయంత్రం కాజులూరు దగ్గరనున్న చేదువాడలో ప్రకాశ్‌గారు గంభీరమైన మీటింగ్‌ను జరిపించిరి, జెర్రీ బేట్స్‌గారు, రిక్కీగారు వాక్యపరిచర్య చేసిరి.

మార్చి 27 వ తేది శుక్రవారం కాకినాడలో కోవూరు రోడ్‌లో సోదరులు సూర్యచంద్ర రావుగారి గృహము నందు స్థానిక సంఘ స్త్రీల కూటము ఘనముగా జరిగెను. అనేక మంది సోదరీలు కూడి రాగా. సహోదరి పౌలాబేట్స్‌గారు చక్కటి వాక్య పరిచర్య చేసిరి. కబితా గూటం గారు తెలుగునకనువదించిరి.

మార్చి 28వ తేదీ శనివారం పశ్చిమగోదావరి జిల్లా కురెళ్ల గూడెంలో జరిగిన సువార్తకూటములో జెర్రీ బేట్స్ దంపతులు, రిక్కీ గూటం గారు పాల్గొనిరి, వాక్య పరిచర్య చేసిరి. నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిరి.

అక్కడ బుర్రే యోహానుగారు సువార్త చాటుచున్నారు.

మార్చి 29వ తేదీ ఆదివారం బేట్స్‌గారు కాకినాడ క్రీస్తు సంఘములో వాక్యపరిచర్యచేసిరి. మార్చి 30 నాడు వారు చెయ్యేరు గున్నేపల్లిలో వాక్యపరిచర్య చేసిరి.

మార్చి 31 వ తేదీ మంగళవారం సత్యవాణి - క్రీస్తు సంఘ ఆవరణలో సువార్తికుల సదస్సుజరిగెను. ఆ సదస్సులో జెర్రీ బేట్స్ గారు, రిక్కీ గారు, రాజా విజయ కుమార్‌గార్లు చక్కటి వాక్యపరిచర్య చేసిరి. పలుప్రాంతముల నుండి హాజరైన అనేక సువార్తికులకు మంచి భోజన సదుపాయలు ఏర్పాటు చేయబడెను. అందరికీ సువార్త పనికొరకు ఉపయోగపడు పుస్తకములు ఉచితముగా అందజేయబడెను. 10 మందికి సైకిళ్లు కూడ ఇయ్యబడెను. ఈ సువార్తపని భారమంతా రిక్కీ గూటం గారు సమర్ధవంతముగా నిర్వహించిరి. జెర్రీ బేట్స్ దంపతులు ఏప్రియల్ 1వ తేదీన అమెరికాకు బయలుదేరి వెళ్లిరి.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2009-2011

To

From:

**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Goolam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004